గింజ కొంటే ఒట్టు



ధాన్యం నిల్వ

ధాన్యం ధరలు పతనం

- జాడలేని కొనుగోలు కేంద్రాలు
- తెరిచిన చోట గింజ స్వీకరించని వైనం
- రైతులను దోచుకుంటున్న దళారులు
- కనిపించని అధికారుల పర్యవేక్షణ
- ఇదీ ఉదయగిరి నియోజకవర్గంలోని పరిస్థితి

ఉదయగిరి: ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటనలు గుప్పిస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఉదయగిరి నియోజకవర్గంలో కొనుగోలు కేంద్రాల జాడ ఎక్కడా కనిపించడం లేదు. దీంతో రైతులు దళారులు అడిగిన ధరకు అమ్ముకుంటూ నష్టాల పాలవుతున్నారు.

50వేల ఎకరాల్లో సాగు

ఉదయగిరి నియోజవర్గ వ్యాప్తంగా రబీ సీజన్‌లో సుమారు 50వేల ఎకరాల్లో బోర్లు, బావులు, వాగులు ఆధారంగా వరి పంట సాగు చేశారు. ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు, దుత్తలూరు, కలిగిరి మండలాల్లో బోర్లు, బావుల కింద ముందస్తుగా సాగు చేసిన వరి పంట కోతకు రావడంతో గత 20 రోజులుగా రైతులు నూర్పిళ్లు చేపడుతున్నారు. రైతులు కోసిన ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు వసతి లేక కళ్లాల్లోనే అమ్మకాలు సాగిస్తున్నారు.

రైతులను దోచుకుంటున్న దళారులు

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరవకపోవడంతో దళారులు రైతులను దోచుకుంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ఏ గ్రేడ్ ధ్యాన్యాన్ని క్వింటా రూ.2,320, బీ గ్రేడ్ ధాన్యాన్ని రూ.2,300కు కొనుగోలు చేయాలి. కానీ కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో దళారులు రూ.2వేలలోపే కొనుగోలు చేస్తున్నారు. దీంతో దాదాపు పుట్టికి రూ.2వేల వరకు రైతులు నష్టపోతున్నారు. ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాల్సిన వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.



వరికోత కోస్తున్న మెషీన్

తెరిచినా ప్రయోజనమేదీ?

ఉదయగిరి మండలం గుడినవరలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లుగా అధికారులు బ్యానర్ కట్టి ఫొటోలు దిగారే తప్ప వాస్తవంగా అక్కడ గింజ కూడా కొనుగోలు చేయలేదు. వింజమూరు మండలం కాటేపల్లి రైతుసేవా కేంద్రంలో కూడా ఇదే పరిస్థితి. రైతుల వద్ద ధాన్యం లేదా అంటే ఆయా గ్రామాల నుంచి నిత్యం ధాన్యం లారీలను దళారులు రైస్‌మిల్లర్లకు పంపుతున్నారు. రైతులు అధికారులను అడిగితే సేకరణ సామగ్రి రాలేదంటూ తప్పించుకుంటున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాలను తెరవడం ఎందుకంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో జేసీ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణపై నిత్యం సమీక్షలు జరుగుతున్నా క్షేత్రస్థాయిలోని అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రైతుల వద్ద ఉన్న ధాన్యం దళారుల పాలవకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలను తెరవాలి



ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పిస్తామని చెప్పినా ఆచరణలో అమలు కావడం లేదు. కొనుగోలు కేంద్రాలను తెరవకపోవడంతో దళారులు ధాన్యం ధరలను తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది పెరిగిన పెట్టుబడులు, తగ్గిన ధరలతో రైతులు అప్పుల పాలవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలను తెరవాలి.

– కాకు వెంకటయ్య,రైతు సంఘం నేత

ప్రభుత్వం ఆదుకోవాలి



ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించక తెగుళ్లు, పురుగు మందులు అధికంగా వాడడంతో పెట్టుబడులు పెరిగాయి. తీరా దిగుబడి చూస్తే ఎకరాకు 20 నుంచి 25 బస్తాలు మాత్రమే వచ్చింది. ఎకరాకు పెట్టుబడి రూ.35వేల వరకు కాగా, ధాన్యం అమ్మితే రూ.30వేలు కూడా చేతికి రాలేదు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– భాస్కర్‌రెడ్డి,రైతు

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం



రైతులకు అవసరమైన చోట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. వ్యవసాయ, మార్కెటింగ్, పౌర సరఫరాలు, ప్రాథమిక సహకార సంఘాల సమన్వయంతో ధాన్యం సేకరణ జరగాలి.ఇప్పటికే గుడినరవలో కేంద్రం తెరిచాం. త్వరలో ధాన్యం సేకరణ చేస్తాం. రైతులు దళారులకు తక్కువ ధరలకు అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకుని మద్దతు ధరను పొందాలి.

–చెన్నారెడ్డి,ఏడీఏ,ఉదయగిరి

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



చేజర్ల: నెల్లూరులోని నివాసంలో ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయళ్ల మాలకొండారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మేకపాటిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

నూనె గింజల పంటల సాగుపై అవగాహన

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని యర్రబల్లిపాళెంలో నూనె గింజల పంటల సాగుపై రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. వ్యవసాయ శాస్త్రవేత్త వీ సునీతాదేవి వేరుశనగ, నువ్వులు, పామాయిల్, ప్రొద్దుతిరుగుడు పంటల సాగు విధానం, ఎరువులు, పురుగు మందుల యాజమాన్యాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఎస్కే హసీనాబేగం, ఏఓలు శైలజకుమారి, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంప్‌లు

అనుమసముద్రంపేట: మండలంలో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ఆధార్ క్యాంప్‌లను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసన్నకుమారి బుధవారం తెలిపారు. 20న అనుమసముద్రం, గుడిపాడు, చిరమన, 21న ఏఎస్‌పేట 1, 2, శ్రీకొలను, రాజవోలు, 22న జమ్మవరం, కేఎంకొండూరు, ఏఎస్‌పేట 1, 2, 24న గుంపర్లపాడు, పెద్దబ్బీపురం, ఏఎస్‌పేట 1, 2, 25న కావలియడవల్లి, చౌటభీమవరం, ఏఎస్‌పేట 1, 2 గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆరేళ్లలోపు పిల్లలకు కొత్తగా ఆధార్ నమోదు చేయడంతో పాటు పాత ఆధార్ కార్డుల్లో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే చేస్తారని వివరించారు.

పరామర్శ



కొల్లా కుటుంబాన్ని పరామర్శిస్తున్న మేకపాటి

అనుమసముద్రంపేట/మర్రిపాడు : ఏఎస్‌పేట, మర్రిపాడు మండలాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబాలను ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. హసనాపురానికి చెందిన రాజవోలు సొసైటీ మాజీ అధ్యక్షుడు కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, ఏఎస్‌పేటకు చెందిన నాయకుడు కొల్లా వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే ఇటీవల తల్లిని కోల్పోయిన కొత్తపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తిప్పిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డిని పరామర్శించారు. అలాగే నందవరం సర్పంచ్ గాలిబోయిన సుబ్బమ్మ, అదే గ్రామానికి చెందిన చుండి కృష్ణారెడ్డి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆదిశేషయ్య, నాయకులు పులిమి వెంకటరమేష్‌రెడ్డి, కంటాబత్తిన రఘునాథరెడ్డి, మర్రిపాడు మండల కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులనాయుడు ఉన్నారు.

శివాజీకి నివాళులు

ఉదయగిరి: స్థానిక బీజేపీ కార్యాలయంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హిందువుల మనోభావాలను కాపాడిన ఏకైక వ్యక్తి శివాజీ అని కొనియాడారు. నాయకులు నెల్లూరు వెంకటస్వామినాయుడు, ఆవుల రోశయ్య, ఎం చెన్నయ్య పాల్గొన్నారు.

నేడు పోలేరమ్మ చీరల వేలం

అల్లూరు: అల్లూరుపేట పోలేరమ్మకు భక్తులు సమర్పించిన చీరలను గురువారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు ఆలయ ఈఓ చిట్టిబాబు బుధవారం తెలిపారు. చీరలను పాడుకుని అమ్మ వారి ఆశీస్సులను భక్తులు పొందాలని కోరారు.

ఉపాధ్యాయుడికి తెలుగుతేజం పురస్కారం



మర్రిపాడు: చుంచులూరు ఉన్నత పాఠశాల తెలుగు పండిట్ మున్నెల్లి శివశంకరయ్యకు పిలోమ్ ట్రోఫి సొసైటీ ఆఫ్ ఇండియా వారు తెలుగు తేజం పురస్కారాన్ని ప్రదానం చేశారు. కర్ణాటక రాష్ట్రం హంపి (అనెగొంది)లో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాజయోన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయనగర రాజు శ్రీకృష్ణదేవరాయల వారి 18వ తరం వారసురాలైన రాజమాత లలితా రాణి శ్రీరంగదేవరాయల చేతుల మీదుగా పురస్కారాన్ని ప్రదానం చేశారు. తాను రచించిన చారిత్రక గ్రంథాలు, తాళపత్ర గ్రంథ పరిష్కారాలు, దారపు ప్రతిమలను పరిశీలించి పురస్కారాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు.

రజక మాన్యం స్థలాన్ని కాపాడాలని నిరసన



నిరసన తెలుపుతున్న రజకులు

సీతారామపురం: స్థానిక ఎల్‌వీఆర్ జూనియర్ కళాశాల సమీపంలోని రజక మాన్యం స్థలాన్ని కాపాడాలని రజకులు కోరారు. ఈ మేరకు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం వారు నిరసన తెలిపారు. గతంలో పీర్లమాన్యంలోని కొంత స్థలాన్ని రజకులకు మాన్యం కింద కేటాయించడం జరిగిందన్నారు. అందులోని కొంత స్థలంలో తాము పక్కాగృహాలు నిర్మించుకున్నామని, మరికొంత స్థలాన్ని రామాలయ నిర్మాణం కోసం వదిలివేశామన్నారు. ఇటీవల పోలీస్‌స్టేషన్ ప్రాంతంలోని పలువురు రజకులు ఖాళీ స్థలంపై కన్నేసి ఆక్రమించుకునేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. ఇదేంటని ప్రశ్నించిన తమపై దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. అధికారులు, పాలకులు స్పందించి రజక మాన్యం స్థలం కబ్జాకు గురికాకుండా చూసి రామాలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. అనంతరం రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

సుబ్బయ్య బడి అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

అల్లూరు: వందేళ్లు పూర్తి చేసుకున్న సుబ్బయ్య బడి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సుబ్బయ్య బడిలో వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వందేళ్లు పూర్తి చేసుకున్న పాఠశాలలు అరుదుగా కనిపిస్తాయన్నారు. బ్రిటీష్ కాలంలో సుబ్బయ్య స్వగృహంలో ప్రారంభించిన బడి వందేళ్లు పూర్తి చేసుకోవడం సంతోషకరమన్నారు. సుబ్బయ్య బడిలో చదివిన ఎంతో మంది నేడు ఉన్నత స్థాయిల్లో ఉండడం గర్వించదగ్గ విషయమన్నారు. తనవంతుగా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పాఠశాల వ్యవస్థాపక కుటుంబ సభ్యులు వేమూరి దివాకర్, వేమూరి రాము, ఎంఈఓలు రవీంద్రనాథ్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మేడా రామసుబ్బారెడ్డి, సభ్యులు మేడా శ్రీనివాసులరెడ్డి, సిద్దా యానాదిశెట్టి, కన్వీనర్ పీ చెంచయ్య, పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



దాత వెంకయ్యకు సత్కారం

చేజర్ల : చేజర్ల మండలంలోని మడపల్లి హరిజనవాడ పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి సహకారాన్ని అందిస్తున్న దాత జువ్వగుంట వెంకయ్యను ఎంఈఓ–2 మస్తానయ్య చేతుల మీదుగా సన్మానించారు. వెంకయ్య తన సొంత నిధులతో పాఠశాలకు ప్రహరీ నిర్మాణం చేపట్టడం, బెంచీలు ఏర్పాటు చేయడం, పిల్లల కోసం వ్యాన్‌ను సమకూర్చడం, వలంటీర్‌ను నియమించడం, ఉపకార వేతనాలు అందజేయడంపై అభినందించారు. యూటీఎఫ్ నాయకులు రవిబాబు, నరహరి, సురేష్, సీఆర్‌ఎంటీ శ్రీనివాసులు, హెచ్‌ఎం తులసి, వలంటీర్ రఘుబాబు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, సర్పంచ్ ఎం వెంకటమ్మ పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి

ఉదయగిరి: గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ఎంపీడీఓ అప్పాజీ సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించి వర్మికంపోస్టును తయారు చేసి పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించాలని సూచించారు. మార్చి నెలాఖరులోగా నూరు శాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని ఆదేశించారు. అనంతరం బీసీ కార్పొరేషన్ రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు 322 మంది దరఖాస్తు చేసుకోగా, 200 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ కరిముల్లా, పంచాయతీ కార్యదర్శులు నాగూర్‌బీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు

ఆత్మకూరు: పదోతరగతి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని ప్రముఖ మోటివేటర్, విశ్రాంత హెచ్‌ఎం నారాయణ రావు పేర్కొన్నారు. పేరారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రేరణ తరగతులను బుధవారం నిర్వహించారు. మోటివేటర్ నారాయణరావు పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థుల గాథలను వివరించారు. ఒత్తిడిని అధిగమించి ప్రశాంతంగా పరీక్షలను రాసేందుకు అనుసరించాల్సిన మార్గాలను విశదీకరించారు. అనంతరం నారాయణరావును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సన్మానించారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య

ఆత్మకూరురూరల్/వరికుంటపాడు: సొంత భూమి కలిగిన రైతులందరికీ వ్యవసాయ శాఖ ద్వారా విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నామని ఆత్మకూరు మండల వ్యవసాయాధికారి కిషోర్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అప్పారావుపాళెంలో సాగుచేసిన పంటలన పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యపై అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో ప్రత్యేక గుర్తింపు సంఖ్య ద్వారానే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ఈనెల 25వ తేదీలోగా రైతులు పంటలను ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. అలాగే వరికుంటపాడు మండలం విరువూరు, వరికుంటపాడులో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ రవికుమార్ పాల్గొన్నారు. విశిష్ట గుర్తింపు సంఖ్యపై అవగాహన కల్పించారు.

ఇంట్లో చోరీ

కావలి : పట్టణంలోని సినిమాహాల్ రోడ్డులో నివాసం ఉంటున్న రమణయ్య తన ఇంట్లో చోరీ జరిగినట్లుగా ఒకటో పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. రమణయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లారు. మంగళవారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువా సైతం తెరిచి ఉంది. అందులోని రెండు సవర్ల బంగారు ఆభరణాలు, నగదు కనిపించలేదు. దీంతో బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

ఉదయగిరి: మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం ఉదయం 11గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీ వేణుగోపాల్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లు హాజరవుతారని చెప్పారు. దరఖాస్తుదారులు ఆధార్, పాస్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సంగం: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షాలెట్ బుధవారం తెలిపారు. ఎంపీపీ కంటాబత్తిన పద్మావతమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరిగే సర్వసభ్య సమావేశంలో మండలాభివృద్ధిపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

ప్రజావ్యతిరేక బడ్జెట్

ఆత్మకూరురూరల్: కేంద్ర బడ్జెట్ పేదలు, బడుగు, బలహీనవర్గాల వారికి వ్యతిరేకంగా ఉందని సీఐటీయూ జిల్లా నాయకుడు ఆర్ నగేష్ అన్నారు. ఆత్మకూరులోని సీపీఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు అధ్యక్షతన కేంద్ర బడ్జెట్ –ప్రత్యామ్నాయ విధానాలపై బుధవారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతు కూలీలకు ఉపాధి కల్పించే ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. కూలీలకు చెల్లించాల్సిన రూ.6,400 కోట్ల నిధులను ఇప్పటికీ చెల్లించలేదన్నారు. ఈ పథకానికి సంబంధించిన రూ.20వేల కోట్ల కాంపొనెంట్ నిధులను ఖర్చు చేయక వృథా చేశారన్నారు. రైతాంగం, రైల్వేజోన్, విశాఖ ఉక్కు, ఇతర సంక్షేమ కార్యక్రమాలను కేంద్రం తుంగలో తొక్కిందన్నారు. సీపీఎం నాయకులు గంటా లక్ష్మీపతి, సందానీ, శ్రీహరి, హజరత్తయ్య, గుల్జార్‌బేగం, గద్దర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచ్‌కు సన్మానం



ఉదయగిరి: ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే పొన్నెబోయిన చెంచురామయ్య కుమారుడు, ఇందుకూరుపేట మండలం పున్నూరు పంచాయతీ సర్పంచ్ పొన్నెబోయిన చెంచుబాలకృష్ణ ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికైన నేపథ్యంలో ఉదయగిరిలో స్థానిక నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గడియాల్చి యస్దాని, ముర్తుజాహుస్సేన్, సికిందర్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రభుత్వాస్పత్రులపై వారిలో నమ్మకం కలిగించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వైద్యాధికారులకు సూచించారు. వింజమూరులో సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన రెండోదఫా అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రోగులకు మంచి సేవలు అందిస్తున్నారని, అదే తీరును కొనసాగించాలని కోరారు. ఉదయగిరి ప్రాంత డయాలసిస్ రోగులకు వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం ట్రయిల్ నిర్వహిస్తున్నామని, త్వరలో జనరేటర్‌ను ఏర్పాటు చేసి అధికారంగా ప్రారంభిస్తామని చెప్పారు. తొలుత వైద్యశాలలోని అన్ని వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. అసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. డీడీఓ కార్తీక్, వైద్యులు మధుసూదన్‌రెడ్డి, అవినాష్ పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతితో మెరుగైన విద్య



సీతారామపురం: మాట్లాడుతున్న ఎంఈఓ మస్తాన్‌వలి

సీతారామపురం/సంగం: అంగన్‌వాడీ చిన్నారులకు మెరుగైన విద్యనందించేందుకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం దోహదపడుతుందని సీతారామపురం ఎంఈఓ మస్తాన్‌వలి పేర్కొన్నారు. సీతారామపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమంలో రెండోరోజు బుధవారం ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. చిన్నారులకు ఆటపాటల కూడిన విద్యతో చిన్నారులను కేంద్రాలవైపు ఆకర్షించి ప్రాథమిక దశలోనే వారిలో విద్యాప్రమాణాలను పెంచేందుకు అంగన్‌వాడీలు కృషి చేయాలన్నారు. అనంతరం డీఆర్పీలు పలు అంశాలపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. అలాగే సంగం మండలం గాంధీజనసంఘం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, రమాదేవి ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీలకు ఉపాధ్యాయులు అంగన్‌వాడీ చిన్నారులకు విద్యనందించే పద్ధతులపై అవగాహన కల్పించారు.

శివపార్వతుల కల్యాణానికి ఆహ్వానం



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని తిరునాళ్లతిప్ప వద్ద ఉన్న కాశీనాయన ఆశ్రమంలోని దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల26 మహాశివ రాత్రి సందర్భంగా నిర్వహించే శివపార్వతుల కల్యాణానికి మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని ఆశ్రమ కమిటీ నిర్వాహకులు ఆహ్వానించారు. బుధవారం వారు నెల్లూరులోని నివాసంలో విక్రమ్‌రెడ్డిని కలిసి కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. జెడ్పీటీసీ పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, పార్టీ పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, ఇందూరు రాజారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆత్మకూరు, ఏఎస్‌పేట, మర్రిపాడు మండలాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు



దుత్తలూరు: మండలంలోని నందిపాడులోని ప్రభుత్వ భూములు, చెరువుల్లోని మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. అలాగే వాగులు, వంకల్లోని ఇసుకను సైతం అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక, మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రామాలయంలో చోరీ

ఆత్మకూరు: మండలంలోని చెర్లోయడవల్లిలోని రామాలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. బుధవారం ఉదయం ఆలయానికి వెళ్లిన భక్తులు ఆలయ తాళం, హుండీని పగులగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మైక్‌సెట్‌తో పాటు హుండీలోని సుమారు రూ.4వేల వరకు నగదును అపహరించుకెళ్లినట్లు గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ జిలానీ తెలిపారు.

ఎస్‌ఎంకే పార్కును శుభ్రం చేయాలని వినతి

ఆత్మకూరు: పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లిలోని ఎస్‌ఎంకే పార్కును శుభ్రం చేయించాలని ఎల్‌ఆర్‌పల్లి యువత, సీపీఐఎం కార్యవర్గ సభ్యులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సీ గంగా ప్రసాద్, చైర్‌పర్సన్ వెంకటరమణమ్మను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పార్కు చెత్త, కంపచెట్లతో అపరిశుభ్రంగా ఉందని, వాటిని తొలగించి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని కోరారు.

ఎంజీఆర్ షటిల్ టోర్నమెంట్ ప్రారంభం



ఆత్మకూరు: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఎంజీఆర్ మెమోరియల్ షటిల్ పోటీలను బుధవారం రాత్రి ప్రారంభించారు. పట్టణంలోని ఎస్సార్‌జేడీ కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ ఆదిశేషయ్య పోటీలను ప్రారంభించారు. పార్టీ సీనియర్ నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, వెంగళరెడ్డి, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఆంధ్రా సుబ్బారెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.